పల్లకుండిపోయారు ఉక్కు భరతం పడుతున్నారు







ఉద్యోగుల జీతాలపై ఎంపీ, ఎమ్మెల్యేలకు బాధ్యత లేదా?

అందుకేనా అంత మెజార్టీ ఇచ్చింది

ఉద్యోగుల్లో ఆగ్రహం, ఆవేదన

ఉక్కునగరం: ఏరు దాటాక తెప్ప తగలేసిన ట్టుంది స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల పరిస్థితి. ఎన్నికల ముందు అప్పటి ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేసి అత్యంత మెజార్టీ సాధించిన విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలు ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ విషయాన్ని పక్కన పెట్టేశారు. రాష్ట్రంలోని పెద్ద ప్రభుత్వరంగ సంస్థలో ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోయినా నిమ్మకు నీరెత్తి నట్టు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఎన్నికల ముందు గాజువాకలో జరిగిన బహిరంగ సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇష్టానుసారం విమర్శలు చేశారు. స్టీల్‌ప్లాంట్ సమస్యను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తాము ఉంటే మీకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించండి.. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడతాం.. మీ సమస్యలు పరిష్కరిస్తామంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. నేటి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్టీల్‌ప్లాంట్‌పై చెయ్యి వేయండి అంతు చూస్తామని భీకర ప్రతిజ్ఞ చేశారు. కట్ చేస్తే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవడం.. కూటమి ప్రభుత్వం ఏర్పడటం జరిగింది. గెలిచిన తరువాత అటు ఎంపీ భరత్, ఇటు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్టీల్‌ప్లాంట్ సమస్య, ఉద్యోగుల ఇబ్బందులను పట్టించుకోవడం మానేశారు.

జీతాలు అందక విలవిల

గత నాలుగు నెలలుగా ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఎంఐలు కట్టలేక, కనీసం పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితుల్లో అప్పులు చేస్తూ బతుకీడ్చాల్సి వస్తోంది. యాజమాన్యం జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితుల్లో ఉండటంతో సాధారణ కార్మికుడు నుంచి ఉన్నతాధికారులు వరకు అనేక విధాలుగా బాధలు పడుతున్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్ పండగలు సమయాల్లో జీతాలు లేకుండా ఇబ్బంది పడాల్సి వచ్చింది. సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సభ్యులకు వస్త్రాలు కొనడం వంటి అనేక అత్యవసర ఖర్చులు ఉంటాయి. అయినప్పటికీ ఈ నెలలో ఎప్పుడు జీతం ఇస్తారో తెలియని పరిస్థితులు ఉన్నాయి.

ప్యాకేజీ వచ్చే వరకు పస్తులేనా?

ఎంపీ, ఎమ్మెల్యేలను ఎప్పుడు కలిసినా మీకు ప్యాకేజీ వస్తుంది. అప్పుడు వరకు సర్దుకుపోండి అని చెప్పడం తప్ప జీతాల చెల్లింపు కోసం వారి చర్యలు కానరాలేదు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన నాయకులతో కేంద్ర ఉక్కు మంత్రి, సంయుక్త కార్యదర్శులు మాట్లాడినట్టే వీరు కూడా మాట్లాడుతుండటం చూస్తుంటే ఇదంతా ప్రీ ప్లాన్డ్ స్కెచ్‌గా కనిపిస్తోంది. ప్యాకేజీ ఇచ్చే వరకు ఉద్యోగులు ఎలా బతుకుతారో ఆలోచించడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్యాకేజీ వచ్చే వరకు తమకు పస్తులు తప్పవా అని వారు ఆందోళన చెందుతున్నారు.

సామర్థ్యానికి మించి ఉత్పత్తి.. అయినా జీతాలు లేవు

రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభించి సామర్థ్యానికి మించి ఉత్పత్తి జరుగుతోంది. అదే విధంగా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయినప్పటికీ వాటిని సాధిస్తున్న ఉద్యోగులకు జీతం చెల్లించకపోవడం అత్యంత దురదృష్టకరం. ఈ అంశాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ఉక్కు మంత్రిత్వశాఖ దృష్టికి తెచ్చి ఎందుకు జీతాలు ఇప్పించ లేకపోతున్నారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఉక్కు మంత్రి పర్యటన తరువాత మరిన్ని కష్టాలు

కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పర్యటన తర్వాత ఉద్యోగుల పరిస్థితి హీనంగా మారింది. ఉద్యోగులు ఒక్కో సదుపాయం కోల్పోతూ వస్తున్నారు. ఉన్న సదుపాయాలను తొలగించడంతో పాటు హెచ్‌ఆర్‌ఏను ఆపడం, ఉక్కునగరం క్వార్టర్లలో విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా ఉద్యోగులపై పెను భారం మోపారు. ఆ తర్వాత జీతాలపై వేటు ప్రారంభమైంది. అక్టోబర్‌లో 50 శాతం బకాయి పెట్టగా, నవంబర్ 35 శాతం, డిసెంబర్ మొత్తం జీతంతో పాటు జనవరి 1కు ఇవ్వాల్సిన మొత్తం జీతంతో ఉద్యోగులకు 285 శాతం పెండింగ్ పెట్టారు. ఉద్యోగుల పెండింగ్ జీతం అంశంపై ఇప్పటికే కార్మిక నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌కు వివరించారు. ఈ అంశంపై కార్మిక నాయకులు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి కుమారస్వామి, ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్‌లను కలిసి మొరపెట్టుకున్నారు. అయినప్పటికి వారి నుంచి ఎటువంటి సానుకూల స్పందన కనిపించలేదు.

ఎంపీ, ఎమ్మెల్యేలు తక్షణం జోక్యం చేసుకోవాలి



స్టీల్‌ప్లాంట్ అంశంపై ఎంపీ, ఎమ్మెల్యేలు తక్షణం జోక్యం చేసుకోవాలి. నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఉద్యోగులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించేలా బాధ్యత తీసుకోవాలి. అదే విధంగా ప్లాంట్‌కు అవసరమైన ఆర్థిక వనరుల ఏర్పాటుకు పార్లమెంట్, అసెంబ్లీలో పోరాడాలి.

– డి.వి. రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి, స్టీల్ వైఎస్సార్‌టీయూసీ

అర్ధాకలితో బతుకుతున్నాం..



యాజమాన్యం నాలుగు నెలలుగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఈఎంఐలు కట్టలేక డిఫాల్టర్లం అవుతున్నాం. డ్యూటీకి రావాలంటే వాహనాలకు పెట్రోల్‌కు కూడా ఇబ్బందిగా ఉంది. ఇక పిల్లల ఖర్చులు, కిరాణా సామగ్రి భారంగా మారింది. అప్పు చేద్దామంటే ఇచ్చేవారు లేకుండా పోయారు. ఎన్నాళ్లిలా అర్ధాకలితో బతకాలి.

– ఎస్. రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

కూటమి ప్రభుత్వంపై ఉక్కు కార్మికుల ఆగ్రహం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో కూటమి నాయకుల హామీల తప్ప..కార్మికులకు మేలు జరిగింది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో 1,421 రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడుతూ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పట్టుబడతారని ఆశించామని, అయితే వాగ్దానాలు తప్పా ఒరిగిందేమీ లేదన్నారు. విశాఖ ఉక్కు, వాటి అనుబంధ సంస్థల్లో లక్షల మంది ఉపాధి పొందుతున్నారన్నారు. పరిరక్షణ మాటలా ఉన్నా కనీసం జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల ఇళ్లు గడవడం కూడా కష్టం ఉందన్నారు. ఆరు మాసాల నుంచి జీతాల సమస్య ఉన్నా నాయకులకు ఏమీ తెలియదన్నట్టు నటిస్తున్నారన్నారు. బీఐఎఫ్ఆర్ ముంగిటకు స్టీల్‌ప్లాంట్ వెళ్లిన సందర్భాల్లో కూడా జీతాలు ఒక్క నెల కూడా ఆపలేదని, ఈ దుస్థితికి కారణం ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, కొంతమంది ఉన్నతాధికారులు నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగమే కారణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించి వెంటనే సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీహెచ్.వెంకటేశ్వరరావు, పి.పరంధామయ్య, యు.వెంకటేశ్వరరావు, పోలిపల్లి లక్కరాజు, కొప్పుల జగన్నాథరావు, రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

అగనంపూడి: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) వార్షిక క్యాలెండర్‌ను గురువారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.పెద్దినాయుడు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అవసరమైన సమాచారంతో రూపొందించిన డైరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. యూనియన్ డైరీలు కావల్సిన ఉపాధ్యాయులు లంకెలపాలెం, పినమడక హైస్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ప్రమాదకరమైన పాలిథిన్ కవర్లపై అవగాహన



పేపర్ ప్లేట్లపై పాలిథిన్‌ను తీసి చూపుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

అక్కిరెడ్డిపాలెం: ప్రమాదకర పాలిథిన్ కవర్లు, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని 68వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని రెస్టారెంట్లలో పేపర్ ప్లేట్స్ రూపంలో ఉన్న అతిప్రమాదకరమైన పాలథీన్‌ను ప్లేట్స్ నుంచి తొలగించి రెస్టారెంట్ ఓనర్‌కు అవగాహన కల్పించారు. వేడి ఆహార పదార్థాల వల్ల పేపర్‌ప్లేట్లలో ఉన్న పాలిథిన్ కరిగి క్యాన్సర్‌కు కారణమయ్యే అవకాశం ఉందన్నారు.

విద్యార్థుల శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ : ప్రపంచ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధి చాపలపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, పాఠశాల సిబ్బందితో కలిసి ప్రపంచ శాంతి కోరుకుంటూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతికి పాఠశాల దశ నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని. ద్వేషంతో ఎవరీ్ గెలవలేమని, శాంతితో ప్రపంచాన్ని జయించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎంసీ చైర్మన్ పైడమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన జిప్సా నాయకులు



డీఈవోను కలిసిన జిప్సా నాయకులు

గాజువాక : జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్‌ను గాజువాక పారిశ్రామికప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) నాయకులు గురువారం కలిశారు. నూతన సంవత్సర డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బడ్జెట్ పాఠశాలల ఎదుర్కొంటున్న సమస్యను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో జిప్సా గౌరవాధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, ఎస్.షణ్ముఖరావు, కోశాధికారి ఎం.బాబూరావు, ప్రతినిధులు పి.మురళీసుందరరావు, ఎం.సత్యనారాయణ, బి.చంద్రమౌళి, మాధవరావు తదితులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో పోరాడుతున్న బాలుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఢిల్లీశ్వరరావు

గాజువాక : క్యాన్సర్‌తో పోరాడుతున్న 18 నెలల బాలుడికి 65వ వార్డు జనసేన పార్టీ నాయకుడు నసపల ఢిల్లీశ్వరరావు ఆర్థిక సహాయం అందజేశారు. ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్న రాజు అనే వ్యక్తి తమ కుమారుడికి క్యాన్సర్ సోకడంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకున్న ఢిల్లీశ్వరరావు టీడీఎస్ సంస్థ ద్వారా రూ.30 వేలను అందజేశారు. కార్యక్రమంలో టీడీఎస్ ప్రతినిధులు జి.విష్ణు, కె.శేఖర్, పి.అప్పలరెడ్డి, బి.గోవింద, ఎం.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీ కృషి చేయాలి



ఉపాధ్యాయులకు పీఎంసీ విధివిధానాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు సునీత, విశ్వనాథ్, ఆంజనేయ

అక్కిరెడ్డిపాలెం: పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లు కృషి చేయాలని గాజువాక 1,2 ఎంఈఓలు డి.విశ్వనాథం, ఎం.సునీతలు అన్నారు. గురువారం 69వ వార్డు మింది జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గాజువాక నియోజకవర్గంలోని పలు జెడ్పీ, ఎంపీపీ స్కూళ్లకు చెందిన హెచ్ఎంలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) మెంబర్లు, చైర్మెన్లకు రూల్స్, బాధ్యతలపై అవగాహన, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ - ఏర్పాట్లు, విధులు, బాధ్యతలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై వివరించారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష - పాఠశాల విద్యా కార్యక్రమాల ద్వారా అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు తెలిపారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక విధానం, విధులు, బాధ్యతలు వంటి వాటిపై మాట్లాడారు. మధ్యాహ్న భోజనంపై వివరించారు. పాఠశాలలో టాయిలెట్ల నిర్వహణపై వివరించారు. ప్రధానోపాధ్యాయులు, గ్రామ వార్డు విద్యా సంక్షేమ సహాయకులు కొరకు డిజిటల్ ఫార్మేట్ నమూనాపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై వివరించారు. సమావేశానికి 80 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో మింది జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్. ఆంజనేయ, అగనంపూడి హెచ్ఎం కృష్ణారావు, రిసోర్స్ పర్సన్స్ భారతి, కృష్ణ వేణి, శంకరమ్మ పాల్గొన్నారు.

సేవలతో ఉన్నత పదవులు



రాథోడ్‌ను సత్కరిస్తున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం: సహోద్యోగులకు, సామాజిక వర్గం ప్రజలకు మరిన్ని సేవలు అందించడం ద్వారా మరిన్న ఉన్నత పదవులు అధిరోహించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఇటీవల జరిగిన అఖిల భారత షెడ్యూల్ ట్రైబ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో స్టీల్ ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాథోడ్ వస్రామ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సత్కార సభలో రాజశేఖర్ మాట్లాడుతూ ఐఎన్‌టీయుసీలో కీలకంగా ఉన్న రాథోడ్ యూనియన్ అభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కారు రమణ, ప్రభాకరరెడ్డి, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, ఎస్.ఎ. నాయుడు, పి.వి. నగేష్, డి. మోహన్, ఎన్. రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా కృషి చేయాలి



మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితుల నాయకులు

పెదగంట్యాడ: నాలుగు నెలలుగా ఉక్కు ఉద్యోగాలు జీతాలు చెల్లించడం లేదని, దీంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించాలని కోరారు. ఈ మేరకు మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ఎం.శ్యామ్‌ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు జరుపుకునే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగులు, కార్మికుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీతాలు చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, అప్పలరెడ్డి, మంత్రి గోపీనారాయణ, యల్లేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం



విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం తిరుమలేశుని జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం ధనుర్మాసం సందర్భంగా భూదేవి, శ్రీదేవి సహీత శ్రీవారి శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు వేంకటేశ్వరుని నిజరూప దర్శనాన్ని చేసుకున్నారు.

అన్నదాన మూలనిధికి విరాళాలు

శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి అన్నదాన మూల నిధికి షీలానగర్‌కు చెందిన వెంకటరామాచార్యులు, రాజ్యలక్ష్మి దంపతులు కుమారుడు సంతోష్ కుమార్, మంజూష దంపతులు రూ.50,000 విరాళంగా దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధు అందజేశారు. షీలానగర్‌కు చెందిన వేణుగోపాలరావు, రేవతి దంపతులు రూ.10,111 అందజేశారు.

సఫ్దర్ హష్మీకి ఘన నివాళి



సఫ్దర్ హష్మీకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: ప్రముఖ నాటక రచయిత, వీధి నాటికల దర్శకులు సఫ్దర్ హష్మీకు సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ స్టీల్ సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఢిల్లీ నగర వీధుల్లో నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధి నాటిక ప్రదర్శిస్తున్న సమయంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయారన్నారు. అయినా రెండో రోజు ఆయన సతీమణి అదే నాటికను అదే పురవీధులలో కొనసాగించడం వారి పట్టుదలకు, నిబద్ధతకు నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ పోరాటంలో కళాకారులు తమ పాట ద్వారా, నృత్యరూపకం ద్వారా, లఘు నాటికల ద్వారా కార్మికులను, ప్రజలను చైతన్య పరచడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.టి. దాస్, యు.రామస్వామి, శ్రీనివాసరాజు, బి. అప్పారావు, ప్రజానాట్య మండలి జిల్లా సహాయ కార్యదర్శి కె. సత్యనారాయణ, స్టీల్ కార్యదర్శి కృష్ణార్జున, యు. వెంకటరావు, వై. రామారావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుముఖం



సోలార్‌పై దుకాణాల్లో అవగాహన కల్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగం వల్ల డబ్బులు ఆదాతోపాటు నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రుషికేశ్వర్ అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేబీఆర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కూర్మన్నపాలెంలోని దుకాణాలు, వాణిజ్య సముదాయాలల్లో సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగించడానికి అవసరమైన సోలార్ పరికరాలు రాయితీ ధరకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. నెలవారి విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా డీఆర్ మొబైల్స్, వస్త్ర దుకాణాలు, సినిమాహాళ్లు, ఆస్పత్రుల్లో యాజమాన్యాలకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధనుంజయ్, నాయక్, లైన్‌మెన్ చెక్కా ప్రకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

మురుగో..మురుగు



వుడా కాలనీ టింపనీ స్కూల్ పక్కన కాలువ దుస్థితి

పెదగంట్యాడ: మండలంలోని పలు ప్రాంతాల్లోని కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కాలువలన్నీ ఛిద్రం కావడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో పందులు తిష్ట వేస్తున్నాయి. జీవీఎంసీ 72, 73వ వార్డు పరిధిలోని వుడా కాలనీలో పరిస్థితి దుర్భరంగా మారింది. ప్రధాన రహదారితో పాటు టింపనీ స్కూల్ పరిసర ప్రాంతాల్లోనూ మరీ అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఎటుచూసిన అపరిశుభ్రత నెలకొని ఉంది. దోమల బెడద ఎకువైంది. నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమలపై దండయాత్ర ప్రచారం ఆర్భాటానికే పరిమితమైంది. మండలంలో అన్ని వార్డుల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు.. ఫాగింగ్ అసలే చేయడం లేదు. దీంతో దోమల వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో పారిశుధ్యంపై లక్షల్లో నిధులు మంజూరు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేవారు.. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా నిధులు సమకూర్చటం లేదు.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు..దోమల నిర్మూలన కు ఆయిల్ స్ప్రే. బ్లీంచింగ్ పొడరు చల్లటం కనిపించడం లేదు..

ఎటు చూసినా చెత్తే..

మండలంలో ఎక్కడ చూసిన మురుగు సమస్య ఎక్కువైంది. ఎటు చూసినా చెత్తే.. ఎక్కడిక్కడ కాలువలు పూడుకు పోవడంతో మురుగునీరంగా రోడ్లపైకి వస్తోంది. ఫలితంగా దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమైంది..పారిశుద్య నిర్వాహణ సరిగా లేక అనేక ప్రాంతాల్లో కాలువల్లో ప్లాస్టిక్, మట్టి ఇతర వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి..ఈ ప్రభావం కారణంగా మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు..ఎక్కడికక్కడే నిల్వ ఉండటంతో అక్కడే నివాసం ఉంటున్న ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. స్వయంగా అధికారులు పర్యవేక్షించి పూడికలను తొలగింపజేస్తే తప్ప ఫలితం ఉండదు.. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఛిద్రమైన కాలువను నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వుడా కాలనీ ప్రధాన రహదారిలో..

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలి

గాజువాక : ఈనెల 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను ప్రజలు జయప్రదం చేయాలని బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. గాజువాక బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖనుంచి ఇప్పటివరకు 20వేల మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, గూటూరు శంకరరావు, కృష్ణంరాజు, శశిధరణ్ పిళ్లై రోహిణి, లలిత తదితరులు పాల్గొన్నారు.